తిరుపతి రూరల్: మండలంలోని తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా దుర్గసముద్రానికి చెందిన సి.మౌనికతోపాటు నూతన డైరెక్టర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పలువురు వారిని అభినందించారు.



బ్రహ్మోత్సవం.. దేవతామూర్తుల అనుగ్రహం

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో బుధవారం స్వామివారి వాహన సేవల ముందు దేవతామూర్తుల రూపాల్లో కళాకారులు ఆకట్టుకున్నారు. వివిధ రాష్ట్రాల కళాకారుల ప్రదర్శనలు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. - తిరుమల

బ్రహ్మోత్సవాలలో నేడు..

తిరుమల: తిరుమలలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం చక్రస్నానం నిర్వహిస్తారు. రాత్రి ధ్వజావరోహణంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి.

కల్యాణ వెంకన్నకు తరలి వచ్చిన సారె..!



అశ్వవాహన సేవకు సారె తీసుకువచ్చిన తుమ్మలగుంట వాసులు , సారె తీసుకువచ్చిన ఉప్పరపల్లె భక్తులు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదవ రోజు గురువారం రాత్రి స్వామి వారు అశ్వవాహనంపై కల్కి అవతారంలో దర్శనమిచ్చారు. తుమ్మలగుంట, ఉప్పరపల్లె, నలందనగర్ వాసులు సారె సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి కుమారులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారని గ్రామస్తులు అభినందించారు.



సారె తీసుకువచ్చిన తుమ్మలగుంట, నలందనగర్ వాసులు

పోస్టర్ల ఆవిష్కరణ



తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో పోషకాహార విలువలకు సంబంధించిన పోస్టర్లను వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, అధికారులు బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయిల్ అండ్ షుగర్ నియంత్రణపై బోర్డులను వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శక్తి చాముండేశ్వరికి పట్టు వస్త్రాల సమర్పణ



సారె సమర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: ప్రతి ఏటా విజయదశమి పర్వదినానికి ముందు నవమినాడు శ్రీ శక్తి చాముండేశ్వరి అమ్మవారికి తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం తరఫున పట్టువస్త్రాలు, పసుపు కుంకుమ సమర్పించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో గురువారం చెవిరెడ్డి కుమారుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తుమ్మలగుంట ఆలయం నుంచి ఎల్ఎస్‌నగర్ వద్దనున్న శ్రీ శక్తి చాముండేశ్వరి ఆలయం వరకు మేళతాళాలు, మంగళ వాయిద్యాల హోరు నడుమ సారె తీసుకెళ్లి సమర్పించారు.

నేడు ఎల్లమ్మకు..

చంద్రగిరి: చంద్రగిరి శ్రీమూలస్థాన ఎల్లమ్మకు గురువారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. సాయంత్రం 5 గంటలకు స్థానిక టవర్‌క్లాక్ వద్ద శ్రీవినాయక స్వామి ఆలయం నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా వెళ్లి పట్టువస్త్రాలు అందజేస్తారని, దీనికి నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులు, అమ్మవారి భక్తులు హాజరు కావాలని ఆ పార్టీ చంద్రగిరి మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ నాయకులతో చర్చించారు. ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఒంటి శివ, మూలస్థాన ఎల్లమ్మ ఆలయ మాజీ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీలు బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, మాధవరెడ్డి నాయకులు శంకర్ యాదవ్, కొత్తపాటి కోటి, కోలా అనిల్, శివకోటి, అంగేరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'గరం గరం చాయ్' ఆవిష్కరణ



గరం గరం చాయ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

తిరుపతి కల్చరల్: సమాజంలో విభిన్న కోణాలను స్పృశిస్తూ రచయిత ఆర్‌సీ.కృష్ణస్వామిరాజు రచించిన 'గరం గరం చాయ్' పుస్తకాన్ని బుధవారం సాయంత్రం వేమన విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. త్రిపురలోని దమ్మ దీప అంతర్జాతీయ బౌద్ధ వర్సిటీ వీసీ ఆచార్య ఎంపీ.నరసింహారావు ముఖ్య అతిథిగా.. రచయిత రచనా శైలి గురించి మాట్లాడారు. కుప్పం ద్రవిడ వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.శైలజమ్మ పుస్తక సమీక్ష చేశారు. పీఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ చైర్మన్ డాక్టర్ జీఎస్.ప్రసాద్, కార్యదర్శి డి.చంద్రమోహన్, రచపలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

మహిషాసురమర్దినిగా గంగమ్మ



ధనలక్ష్మి అలంకరణలో

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో అమ్మవారు బుధవారం మహిషాసురమర్దిని అలంకరణలో, కొత్త వీధిలోని శ్రీకన్యకాపరమేశ్వరి శ్రీశక్తి పూజ అలంకరణలో, చింతకాలయ వీధిలోని కరకమాని గంగమ్మ..ధనలక్ష్మి అలంకరణలో, మంగళం రోడ్డులోని బొంతాలమ్మ..సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

3న ప్రజాస్వామ్య పరిరక్షణ సదస్సు

తిరుపతి కల్చరల్: ఈనెల 3న రామతులసి కల్యాణ మండపంలో నిర్వహించ తలపెట్టిన ప్రజాస్వామ్య పరిరక్షణ సదస్సుకు వామపక్ష, ప్రజాస్వామ్యవాదులందరూ హాజరై జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో సదస్సు కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న యువకులు

చంద్రగిరి: జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం పురస్కరించుకుని బుధవారం స్వర్ణముఖి మహిళా పరస్పర సహకార సంఘం(స్వమాక్స్) రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఆ సంస్థ సీఈఓ విశ్వనాథ్ ప్రారంభించి మాట్లాడారు. తిరుపతి మెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ ప్రసన్న ఠాగూర్ యువత నుంచి రక్తం సేకరించారు. రక్తదానం చేసిన 30మంది యువకులను విశ్వనాథ్, వైద్యాధికారులు అభినందించారు. డాక్టర్ శ్రీకర్ రాజు, స్వమాక్స్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సంస్కృత వర్సిటీలో..

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో బుధవారం ఎన్ఎస్ఎస్ విభాగం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసింది. దీనిని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి ప్రారంభించి మాట్లాడారు. దాదాపు 60 మందికి పైగా విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది రక్తదానం చేశారు. రిజిస్ట్రార్ కేవీ నారాయణరావు, స్విమ్స్ వైద్యులు పాల్గొన్నారు.

అభినందన



తిరుపతి కల్చరల్: ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కేవీ.చౌదరిని బుధవారం తిరుపతి శాఖ కార్యాలయంలో ఆ సంస్థ ప్రతినిధులు ఘనంగా సత్కరించి అభినందించారు. తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అభివృద్ధికి కేవీ.చౌదరి ఎంతో కృషి చేశారని, ఆయన రాష్ట్ర ఉపాధ్యక్షుడు కావడం తమకెంతో ఆనందంగా ఉందని ఆ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌కుమార్ రాజు, వాసుదేవన్ హర్షం వ్యక్తం చేశారు.

శ్మశాన వాటిక కబ్జా వెనుక ఆర్‌సీ హస్తం



తిరుపతి కల్చరల్: ఎంఆర్ పల్లె, మారుతీనగర్‌లోని శ్మశాన వాటిక స్థలం కబ్జా వెనుక డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ ఉన్నారని తాను బట్టబయలు చేయడంతో ఆయన తనపై నిందారోపణలు చేస్తున్నారని ఎంఆర్‌పల్లె డివిజన్ వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జ్ శేఖర్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన పార్టీ నేతలతో కలిసి ఆర్‌సీ మునికృష్ణ ఆరాచకాలకు సంబంధించిన ఫొటోలను ప్రదర్శిస్తూ మాట్లాడారు. తనపై నిస్సిగ్గుగా పచ్చి అబద్ధాలతో తప్పుడు ఆరోపణలు చేయడం సిగ్గుమాలిన చర్య అని, దీనిపై కాణిపాకంలో ప్రమాణానికి సిద్ధమా? అని ఆర్‌సీకి సవాల్ విసిరారు. శ్మశాన స్థలం కబ్జా వెనుక ఆర్‌సీ మునికృష్ణే ఉన్నారని సాక్షాత్తు ఎంఆర్‌పల్లె పరిరక్షణ కమిటీయే చెప్పిందని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ నేతలు జీవరత్నం, వాసు యాదవ్, అనిల్, సద్దాబాబు, చంద్ర, పావని, మహితా రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, భవిత పాల్గొన్నారు.